అన్నదాత..ఆగమాగం


నర్సంపేట రూరల్: భాంజీపేటలో నేలవాలిన వరి పంట


చెన్నారావుపేట శివారులో నేలవాలిన మొక్కజొన్న

- నేలవాలిన మిర్చి, వరి, పత్తి పంటలు
- మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నష్టం
- సర్వే చేసి ఆదుకోవాలంటున్న రైతులు

చెన్నారావుపేట : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షార్పణమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాపయ్యపేట, బోజేర్వు, చెన్నారావుపేట, జల్లీ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట, మిర్చి పంటలు నేలవాలాయి. వరి ధాన్యం తడిచి రైతులు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం నష్టపోయిన పంటలను సర్వే చేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.అలాగే మండలంలోని ఉప్పరపల్లికి చెందిన కౌలు రైతు పప్పు శ్రీపాల్‌రెడ్డి సైతం ప్రభుత్వం స్పందించి పత్తి, వరి, రైతులను ఆదుకోవాలన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు మండలంలోని రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. మూడు రోజులుగా కురుస్తున్న వానలతో వరి, మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఇప్పటి వరకు మండలంలో వందల ఎకరాల్లో వరి, మిర్చి, పత్తి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


చెన్నారావుపేట: మిర్చి పంటను చూపుతున్న కౌలు రైతు శ్రీపాల్‌రెడ్డి

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

నర్సంపేట రూరల్ : మిచాంగ్ తుపాన్‌తో వీచిన ఈదురు గాలులు, అకాల వర్షానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి అంతా వర్షార్పణం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై భారం

సంగెం : మండలంలోని చెరువుల కింద కోతకు వచ్చిన వరి పంట తుపాన్ వల్ల మరింత ఆలస్యం అవుతున్నాయి.దీంతో సాధారణ వరి కోత యంత్రాలు పనిచేయవని చైన్ యంత్రాలు కావాల్సి వస్తుందని ఖర్చు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం ఆరబెట్టడానికి అనువైన స్థలం లేక, వాన నుంచి కాపాడుకోవడానికి సరిపోను టార్పాలిన్లు లేక ఆందోళన చెందుతున్నారు. తుపాన్ తీవ్రత ఎక్కువై అకాల వర్షం కురిస్తే అన్నదాతలకు భారీ నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


చెన్నారావుపేట గ్రామ శివారులో నేలవాలిన మిర్చి పంటను చూపుతున్న రైతు రవి

తడిసిన వరి, మిర్చి, పత్తి పంటలు

ఖానాపురం : అకాల వర్షంతో మండల వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికందిన పంటలు ఇంటికి రాకముందే అకాల వర్షం పెనుప్రభావం చూపుతుంది. పంట పొలాల్లో వరి మొదలు తడిసిపోతున్నాయి. రోడ్లపై, సబ్‌మార్కెట్ యార్డులు, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తడవనీయకుండా రైతులు అపసోపాలు పడుతున్నారు. పత్తి పంటలు ఏరక పోవడంతో తడిసిపోతుంది. మిర్చి తోటలు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి.


ఖానాపురం: ధర్మరావుపేటలో నేలవాలిన మిర్చి


సంగెం: లోహిత కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


నర్సంపేట రూరల్: భాంజీపేటలో..

‘సమస్యలు పరిష్కరించాలి’

సంగెం : రిటైర్డ్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రు సుధీర్‌బాబు, ఎస్.సదానందం ప్రకటనలో కోరారు. పదవీ విరమణ పొందిన వారు తమకు చెందిన ప్రయోజనాలు అందక మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతి నెల 1వ తేదీన పెన్షన్లు రావడం లేదన్నారు. డియర్‌నెస్ రిలీఫ్ సకాలంలో మంజూరు చేయకుండా ఇంకా పెండింగ్‌లోనే పెట్టారని పేర్కొన్నారు. హెల్త్‌కార్డులు పనిచేయడం లేదని, అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోక గత ప్రభుత్వ హయంలో ఇబ్బందులు పడ్డామని తెలిపారు. కొత్త ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొలువుదీరుతున్న ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

హసన్‌పర్తి: ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో వెన్నపురెడ్డి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు , కార్యకర్తలు, మాలధారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌క్రైం , కేయూసీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. ఫోన్‌లో వచ్చే ఓటీపీలపై అప్రమత్తంగా ఉండడమే కాకుండా వాటిని ఎవరికి చెప్పొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కేయూసీ ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహం అడ్డగింత


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై మహేందర్

చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలంలోని ఓ తండాలో పదిహేను సంవత్సరాల బాలికకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తోట మహేందర్ బుధవారం సదరు గ్రామానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి వికాస్, అంగన్‌వాడీ టీచర్ కుందా జ్యోతి, పోలీస్ సిబ్బందితో బాలిక తల్లిదండ్రులకు గ్రామపెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహ వయస్సు వచ్చే వరకు పెళ్లి చేయకూడదని, ఒకవేళ వివాహం చేసినట్లయితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తల్లిదండ్రులను ఆయన హెచ్చరించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


వేడుకల్లో ఎస్సై మాధవ్, పోలీసులు

ఖానాపురం : అంకితభావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్సై మాధవ్ అన్నారు.ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో హోం గార్డుల పాత్ర కూడా కీలకమైందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌సీ కుమారస్వామి, పీసీ రమేశ్, సుమన్, రవీందర్, హోంగార్డులు ఎర్రయ్య, రమేశ్, ఈశ్వరయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి


చెన్నకేశవాచారి (ఫైల్)

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు డింగరి చెన్నకేశవాచారి(90) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు పలువురు చెన్నకేశవచారి మృతదేహనికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని కొనియాడారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నెక్కొండ యూనిట్ అధ్యక్షుడు గటిక మల్లయ్య, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

‘పద్ధతి మార్చుకోవాలి’


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నర్సంపేట : నర్సంపేటలోని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అదే పాఠశాలలో పని చేస్తున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఈర్ల అనిల్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ ఇలాంటి పద్ధతులకు స్వస్తి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అజ్మీరా సదర్‌లాల్, జితేందర్, అజయ్, విక్రమ్, మధు, మహేందర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పాలసీ సొమ్ము అందజేత

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన బాపూజీ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు కూతురు విద్యాసాగర్ ఇటీవల మృతి చెందాడు. కాగా విద్యాసాగర్ పొదుపు సంఘంలో పాలసీ పొంది ఉండగా జీఎఫ్ఎస్ అభయనిధి సొమ్ము రూ. 70వేలతో పాటు పొదుపు బోనస్ రూ. 30వేల114ను సమితి అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ బుధవారం నామినీకి అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు మొగిడే బాపురావు, పాలకవర్గ సభ్యుడు పాపారావు, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, మల్లాజి, అమరేందర్, ప్రేమ్‌సాగర్, రాజేశ్వర్, విజయరావు, లింగమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఉండాలి

ఆత్మకూరు: మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజాసేవలో ఉండాలని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


దుగ్గొండి: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తోకల శ్రీనివాసరెడ్డి


ఖానాపురం: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఖానాపురం : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు.ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల కష్టాల్లో ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా వెన్నంటి ఉంటామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేస్తామన్నారు. దొంతి మాధవరెడ్డి సహకారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా మాధవరెడ్డికి నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు.సమావేశంలో నాయకులు వెంకటప్రసాదరావు, భిక్షం రెడ్డి, వీరమనేని సాగర్‌రావు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, ఎంపీటీసీ విజాకర్‌రావు, పూల్‌సింగ్, నాయకులు కొన్కటి రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్, బిక్కి మురళీ, చెడిపాక ఉపేందర్, పాడుపుగంటి మధు, పల్నాటి శ్రీనివాస్, బొబ్బ విద్యాసాగర్‌రావు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘దొంతి’కి మంత్రి పదవి ఇవ్వాలని తీర్మానం

దుగ్గొండి : ప్రతి కార్యకర్త అధికార దర్పం ప్రదర్శించకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికి సేవలందించి మన్ననలు పొందాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా రాష్ట్ర కేబినెట్‌లో దొంతి మాధవరెడ్డికి అవకాశం కల్పించాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మండల కమిటీ ఆమోదించింది. తీర్మాన ప్రతులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర పీసీసీకి పంపాలని తీర్మానించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఓలిగె నర్సింగరావు, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, బూరుగు రవీందర్, బొల్లెపల్లి రాము, ఇంగోలి రాజేశ్వర్‌రావు, మట్ట రాజు, రామారావు, మాదాసి సాంబయ్య, అజ్మీరా రవీందర్, నర్సింహారెడ్డి, దంజ్యా నాయక్, కొలిపాక బుచ్చయ్య, రమేష్, సక్కుబాయి. బుర్రి సునీత, వివిధ గ్రామాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి’

పరకాల: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఆపార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయంగానే కాకుండా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి మచ్చలేని నాయకుడని అన్నారు. రేవూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా అభివృద్ధి కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంత్రి పదవి ఇస్తే జిల్లా అభివృద్ధికి కృషిచేస్తారని తెలిపారు. అధిష్టానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, పావుశెట్టి సునీల్, మేరుగు శ్రీశైలం, ఒంటేరు కుమార్, చందుపట్ల రాఘవరెడ్డి, ఇనుగాల రమేష్, బొచ్చు కుమార్, దుప్పటి రాజేష్, ఒంటేరు కుమార్, గోవిందు రవీందర్, కొయ్యడ కుమార్, గోవింద రాజేందర్, పసుల శ్రీను, ఏకు సుధీర్, జేరిపోతుల గోపి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం


సంగెం: మండల పరిషత్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కళావతి


వర్ధన్నపేట: మున్సిపల్ కార్యాలయంలో అరుణ


రాయపర్తి: పెర్కవేడులో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ బాధ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అలాగే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

\- సాక్షి నెట్‌వర్క్


నర్సంపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


చెన్నారావుపేట: పూలమాల వేస్తున్న శంకర్


పర్వతగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు


వర్ధన్నపేట: పూలమాల వేస్తున్న కొండేటి శ్రీధర్


నెక్కొండలో పూలమాల వేస్తున్న రంజిత్‌రెడ్డి


ఖానాపురం: పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నర్సంపేట రూరల్: నివాళులర్పిస్తున్న రవి


నర్సంపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద..


నల్లబెల్లి: నందిగామలో దళిత సంఘాల నాయకులు


గీసుకొండ: చంద్రయ్యపల్లిలో..

సమష్టి కృషితోనే కాంగ్రెస్‌కు మెజార్టీ

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో మండల ఓటర్లు భారీ మెజార్టీని కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టారు. మండలంలో మొత్తం 37వేల ఓట్లపై చిలుకు ఉండగా 33వేల ఓట్లు పోలయ్యాయి. బీజేపీ, నోటా, ఇతరులు మినహాయించి నాగరాజుకు 19,344ఓట్లు వేయడం.. మండల చరిత్రలో కాంగ్రెస్ పార్టీకి 8,087ఓట్లు మెజార్టీ రావడం ప్రప్రథమం అని చెప్పవచ్చు. కాగా ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు కాంగ్రెస్‌పై ఉన్న అభిమానం, అదే విధంగా స్థానిక నాయకత్వ లోపం, అరూరి రమేశ్‌పై వ్యతిరేకత, ఉద్యమకారులకు సరైన ప్రాధాన్యత కల్పించకపోవడంతో పాటు ఇతర పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారు ఆధిపత్య ధోరణి చెలాయించడం పార్టీకి వ్యతిరేకంగా మారాయి. దీంతో పాటు నిరుద్యోగ యువత, భూమి లేని పేదలు, గిరిజనులు, బీఆర్ఎస్ పార్టీలో పని చేస్తున్న కొంతమంది కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారు. ఈ విధంగా మండలంలో భారీ మెజార్టీ రావడానికి కాంగ్రెస్ పార్టీకి దోహదపడింది. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం గతంలో మండలంలో మూడు గ్రూపులుగా ఉన్నప్పటికి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ సమష్టిగా పని చేసి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ చేకూర్చే విధంగా కృషి చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఒక్కతాటిపైకి తెచ్చి పార్టీ మెజార్టీ ఇచ్చేందుకు కృషి చేశారు. దాదాపు 50శాతం మెజార్టీ ఒక్క పర్వతగిరి మండలంలో రావడం భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని చెప్పవచ్చు.

పదేళ్ల నిరీక్షణ ఫలాలు మాకే దక్కాలి

- అధికార పార్టీలో చేరికకు తీవ్ర ప్రయత్నాలు
- వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

సంగెం : పదేళ్ల నిరీక్షణ అనంతరం కాంగ్రెస్ పార్టీ అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో అధికారంలోకి రావడంలో పార్టీ శ్రేణుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అంతలోనే పార్టీలోకి చొరబడేవారి గురించి ఒకింత భయం మొదలైంది. ఆయా గ్రామాల్లో ఏ ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసినా ఒకటే చర్చ సాగుతోంది. త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలే దీనికి కారణం. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన నాయకులకు అక్రమ కేసులు, బెదిరింపులు, అవహేళనలు, అవమానాలు, చీత్కారాలు ఎదురయ్యాయని వాట్సాప్ గ్రూపుల్లో తమ ఆవేదనను వ్యక్తం చేసుకుంటున్నారు. మండలంలో, గ్రామాల్లో ఇన్నేళ్లుగా అధికార దాహంతో విలువలు వదిలి టీడీపీ, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీల్లోకి దూరి గ్రామ, మండలస్థాయి పదవులు అనుభవించిన వారంత ఇపుడు తిరిగి మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ప్రయత్నాలు ప్రారంభించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ జెండాలు గ్రామాల్లో కన్పించొద్దని తీవ్ర ప్రయత్నాలు చేసి ఎవరు పార్టీకోసం పనిచేయకుండా కట్టడి చేసినా వారు.. ఇపుడు కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. వారిని చేరదిస్తే తాము వెనకబడి పోతామని, భవిష్యత్ ఉండదని పాతకాపులు ఆందోళన చెందుతున్నారు. అలాంటి అధికార దాహం ఉన్న అవకాశ వాదులను కాంగ్రెస్ పార్టీలోకి రానియ్యకుండా చర్యలు తీసుకుని ఇన్నాళ్లు పార్టీకోసం కష్టపడ్డ శ్రేణులకు రాజకీయ భవిష్యత్ ఉండేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. వీరి గోడును పట్టించుకుని కేవలం అధికారం కోసం ఆశపడి వచ్చేవారిని కట్టడి చేసి పదేళ్ల కష్టపడిన కార్యకర్తలు అభీష్టాన్ని నెరవేర్చుతారో లేదో త్వరలోనే తేలిపోతుంది.

మందుబాబుల నిలయంగా ‘రైతువేదిక’

శాయంపేట : రైతుల సమావేశం కోసం ప్రభుత్వం నిర్మించిన రైతు వేదిక మందుబాబులకు నిలయంగా మారుతోందని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని రైతువేదికను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తమ సమస్యల పరిష్కారం, అభిప్రాయాలను చర్చించేందుకు రైతువేదికలు నిర్మించారని, కానీ మండల కేంద్రంలోని రైతు వేదిక మందుబాబులకు అడ్డగా మారుతుందని ఆరోపించారు. రైతువేదికకు ఎదురుగా వైన్స్ షాపు ఉండడంతో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులూ.. దర్జాగా రైతువేదిక పరిసరాల్లో మద్యం తాగి, ఖాళీ సీసాలు పగలగొడుతున్నారని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయక పోవడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యారని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని వారు కోరారు.